# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 30-09-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. అన్ని వర్గాల ప్రజలకు జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలు తెలిసేలా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు.**

**2. "విజయవాడ ఉత్సవ్" కళలు, సంస్కృతి ప్రతిభకు వేదికగా నిలిచిందని కేంద్ర పౌర విమానాయన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.**

**3. దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ ఈరోజు శ్రీదుర్గాదేవిగా భక్తులకు దర్శనమిస్తున్నారు.**

**4. హైదరాబాద్‌లో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన బతుకమ్మ వేడుకలు రెండు గిన్నిస్ వరల్డ్ రికార్డులను సాధించాయి.**

==========================

అన్ని వర్గాల ప్రజలకు వస్తు సేవల పన్ను-జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలు తెలిసేలా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. "సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్" పేరిట రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న కార్యక్రమం కోసం ఏర్పాటైన మంత్రి వర్గ ఉపసంఘంతో ముఖ్యమంత్రి నిన్న గుంటూరు జిల్లా ఉండవల్లి క్యాంప్ కార్యాలయం నుంచి దృశ్య మాధ్యమం విధానంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఈరోజు నుంచి అక్టోబర్ 19వ తేదీ వరకు వివిధ రంగాల వారీగా ఆయా శాఖలు ప్రచారం చేపట్టాలని సూచించారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈరోజు ఢిల్లీ వెళ్లనున్నారు. పర్యటనలో భాగంగా విశాఖపట్నంలో నవంబర్ 14, 15 తేదీల్లో భారత పరిశ్రమల సమాఖ్య సీఐఐతో కలిసి నిర్వహించనున్న పెట్టుబడుల సదస్సుకు పారిశ్రామిక వేత్తలను ఆహ్వానించనున్నారు. అనంతరం సాయంత్రం జరిగే సీఐఐ పార్టనర్షిప్ సమ్మిట్ కర్టెన్ రైజర్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొంటారు. అలాగే ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్రమంత్రులు అమిత్ షా, నిర్మలా సీతారామన్‌తోనూ ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు.

--------------------------

"విజయవాడ ఉత్సవ్" కళలు, సంస్కృతి ప్రతిభకు వేదికగా నిలిచిందని కేంద్ర పౌర విమానాయన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. విజయవాడ భవానిపురం పున్నమి ఘాట్, గొల్లపూడి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో గత రాత్రి జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలను కేంద్ర మంత్రి తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ,

వాయిస్.. 30 సెకన్లు

---------------------------

దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ ఈరోజు శ్రీ దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిస్తున్నారు. ఉత్సవాలు చివరకు చేరడంతో భక్తుల రద్దీ పెరిగింది. తెల్లవారుజాము నుంచే విశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుంటున్నారు.

ఇదిలా ఉండగా శ్రీశైలంలో దసరా మహోత్సవాలలో భాగంగా గత రాత్రి శ్రీభ్రమరాంబికాదేవి మహాగౌరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను నంది వాహనంపై కొలువుదీర్చి అర్చకులు పూజలు నిర్వహించారు.

---------------------------

హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గత సాయంత్రం బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా .. ఒక వెయ్యి 354 మంది మహిళలు భారీ బతుకమ్మ చుట్టూ చేరి లయబద్ధంగా ఆడినందుకు 'అతిపెద్ద జానపద నృత్యానికి' కి గానూ రెండు గిన్నిస్ వరల్డ్ రికార్డులు నమోదైయ్యాయి. దీనికి సంబంధించిన ధ్రువపత్రాలను గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధులు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కడంతో బతుకమ్మ ఖ్యాతిని ప్రపంచానికి చాటామని చెప్పారు.

---------------------------

మహిళా ఆరోగ్య సంక్షేమమే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. 'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్' కార్యక్రమంలో భాగంగా పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు ప్రాంతీయ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన వైద్య, రక్తదాన శిబిరాలను మంత్రి నిన్న ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మహిళల ఆరోగ్య పరిరక్షణకు 'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్' కార్యక్రమం ఎంతగానో దోహదం చేస్తోందన్నారు. వీటి ద్వారా మహిళలకు వివిధ రకాల స్క్రీనింగ్ పరీక్షలకు వీలుంటుందని చెప్పారు.

---------------------------

తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా గత రాత్రి మలయప్ప స్వామి గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. భక్తజన బృందాల భజనలు, కోలాటాల నడుమ స్వామి వారి వాహనసేవ కోలాహలంగా సాగింది. అంతకు ముందు శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి స్వర్ణరథంపై ఊరేగారు.

---------------------------

ప్రజాసేవ, సుపరిపాలనకు ప్రాధాన్యమిస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు కృషి చేస్తోంది. "సేవా పర్వ్" పేరుతో ఆకాశవాణి విజయవాడ

ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. జాతీయ విద్యా విధానం 2020 ద్వారా కేంద్ర ప్రభుత్వం ఆధునిక, సమ్మిళిత భవిష్యత్తు కోసం దేశ విద్యా వ్యవస్థను ఎలా సన్నద్ధం చేస్తుందో ఈరోజు తెలుసుకుందాం.

వాయిస్ ఓవర్ (01 : 34)

---------------------------

అంతర్జాతీయ అనువాదకుల దినోత్సవం ఈరోజు నిర్వహిస్తున్నారు. ఒక భాషలోని భావాలను మరొక భాష మాట్లాడే ప్రజలకు అర్థమయ్యేలా కృషి చేస్తున్న వీరి సేవలను గుర్తించే ఉద్దేశ్యంతో ఐక్య రాజ్య సమితి పిలుపు మేరకు ప్రతి ఏటా సెప్టెంబర్ 30వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది. ప్రపంచ అనువాద పితామహునిగా పేరొందిన...., గ్రీకు భాషలో ఉన్న బైబిల్‌ను లాటిన్ భాషలోకి అనువదించిన సెయింట్ జోరం వర్ధంతిని అనువాదకుల దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. క్రీస్తు పూర్వం 420 సంవత్సరం సెప్టెంబర్ 30వ తేదీన బేత్లహాం నగరంలో ఆయన మరణించారు. వివిధ భాషలలోని సమాచార వ్యాప్తి కోసం అనువాదకులు నిర్వహిస్తున్న పాత్ర పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈరోజు పలు కార్యక్రమాలు జరుగుతున్నాయి.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో తగ్గించిన విద్యుత్ ఛార్జీలు నవంబర్ నుంచి అమలులోకి వస్తాయని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో నిన్న మాట్లాడుతూ, ప్రభుత్వం ట్రూడౌన్ పేరుతో కరెంటు ఛార్జీలు తగ్గించిందని అన్నారు. అధికారంలోకి వచ్చిన 15 నెలల్లో యూనిట్‌పై 13 పైసలు తగ్గించామని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

ఉత్తరాంధ్ర దాని పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో కోస్తాంధ్ర జిల్లాల్లో రానున్న రెండు రోజులపాటు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతారవరణ శాఖ అధికారి ఎమ్.వెంకట్రావు తెలియజేస్తూ,

..వాయిస్.. 27 సెకన్లు

మరోవైపు తెలంగాణలోనూ ఈరోజు, రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

=====================